రేపు గోపన్‌పల్లితండా ఫ్లైఓవర్ ప్రారంభం

పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ, నాయకులు, అధికారులు



ఫ్లైఓవర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, అధికారులు, నాయకులు

రాయదుర్గం: గోపన్‌పల్లితండా ఫ్లైఓవర్‌ను శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లితండా కూడలిలో రూ.28.50 కోట్ల వ్యయంతో చేపట్టిన ఫ్లైఓవర్ తుదిమెరుగులుదిద్దే పనులను ఆయన గురువారం గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హెచ్‌సీయూ బస్టాండ్ నుంచి ఔటర్‌రింగు రోడ్డు వరకు వయా వట్టినాగులపల్లి మీదుగా నిర్మిస్తున్న రోడ్డుతో ప్రజలకు మరింత సౌకర్యం కలుగుతుందన్నారు. గోపన్‌పల్లితండా ఫ్లైఓవర్ నిర్మాణంతో ట్రాఫిక్ కష్టాలు తీరతాయన్నారు. అనంతరం కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్ డీసీ రజనీకాంత్‌రెడ్డి, ఆర్ అండ్ బీ డీఈ సీతారామయ్య, ఏఈ అజయ్‌కుమార్, జీహెచ్‌ఎంసీ ఈఈ శ్రీనివాస్, డీఈ మల్లికార్జున్, ఏఎంఓహెచ్ నగేష్‌నాయక్, ఎస్‌ఆర్‌పీ భరత్, నాయకులు గణేష్ ముదిరాజ్, శ్రీనివాస్‌యాదవ్, సత్యనారాయణ, రాజునాయక్ అనిల్, మల్లేష్, వినోద్, నగేష్, తిరుపతి, శేఖర్, ప్రభాకర్, ప్రకాశ్, శ్రీరాములు, రమేష్, రాజు, నర్సింగ్‌నాయక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జగదీశ్వర్‌గౌడ్, హమీద్ పటేల్

శేరిలింగంపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా చిత్తశుద్ధితో నెరవేరుస్తుందని ఆ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జీ వి.జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. గురువారం రైతులకు రుణమాఫీ ప్రకటించిన నేపథ్యంలో నల్లగండ్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కార్పొరేటర్ హమీద్ పటేల్‌తో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేస్తోందన్నారు. ఒకే విడతలో రూ.2లక్షల వరకు ప్రభుత్వం మాఫీ చేస్తుందని వివరించారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



ఎమ్మెల్యే గాంధీతో కాంగ్రెస్ హైదర్‌నగర్ డివిజన్ నాయకులు

ఆల్విన్‌కాలనీ: ఇటీవల కాంగ్రెస్‌పార్టీలో చేరిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని గురువారం హైదర్‌నగర్ డివిజన్, ఆల్విన్‌కాలనీ డివిజన్, మున్నూరు కాపు సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజల సంక్షేమమే తన ప్రథమ కర్తవ్యంగా భావించి కాంగ్రెస్ పార్టీలో చేరామన్నారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం అన్నారు. ఏడు నెలలుగా నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని, కాంగ్రెస్ పార్టీలో చేరికతో అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతుల రాజేందర్, దామోదర్ రెడ్డి, నక్కా శ్రీనివాస్, సత్యనారాయణ, రాఘవేంద్రరెడ్డి, సుధాకర్‌రెడ్డి, చందు నాయక్, రేణుక, కృష్ణారావు, సంపత్‌రెడ్డి, కట్ట శ్రీనివాస్, కృష్ణ గౌడ్, వంశీకృష్ణ, మున్నూరు కాపు సంఘం సభ్యులు తేళ్ల హరికృష్ణ, తూము వినయ్‌కుమార్, తూము ఎల్లారావు తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్క.. దోమల బెడద

బెంబేలెత్తుతున్న బస్తీలవాసులు



కాముని చెరువులో అల్లుకుపోయిన గుర్రపుడెక్క

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ సున్నం చెరువు, కాముని చెరువు, మైసమ్మ చెరువుల్లో గుర్రపు డెక్క పెరిగిపోవటంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో విష జ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందని చెరువుల సమీపంలో ఉన్న బస్తీ, కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సున్నం చెరువు సమీపంలోని పద్మావతినగర్, గాయత్రినగర్, మేరాజ్ నగర్, అజిత్‌నగర్‌వాసులకు కంటిమీద కునుకు ఉండడం లేదు. దీనికి తోడు చెరువు నుంచి దుర్వాసన వెలువడుతోంది. ఇక సున్నం చెరువు దారి హైటెక్‌సిటీ మార్గం కావటంతో రద్దీ ఉంటుంది. దుర్వాసన భరించలేకపోతున్నామని వాహనదారులు వాపోతున్నారు. అదే విధంగా సర్దార్ నగర్ సమీపంలోని కాముని చెరువులో కూడా విపరీతంగా గుర్రపు డెక్క పెరిగింది. దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సమీప కాలనీలైన యూసుఫ్‌నగర్, సఫ్దార్‌నగర్‌లలో నివసించే ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గుర్రపుడెక్కను తొలగించాలని పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. మైసమ్మ చెరువులోని గుర్రపుడెక్కతో పాటు చెతత్తో నిండిపోవటంతో సమీప రాజీవ్ గాంధీనగర్, శక్తినగర్, అంజయ్యనగర్‌లతో పాటు పలు కాలనీలవాసులు అవస్థలు పడుతున్నారు.

ప్రహరీగోడ లేని అంగన్‌వాడీ కేంద్రం (మహిళా భవన్)





చెంతనే ఐటీ సమస్యలెన్నో..



అమెజాన్ కంపెనీ, వేవ్‌రాక్ భవనం, అంతర్జాతీయ సంస్థల చేరువలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పేరుకుపోయిన చెత్త

రాయదుర్గం: నానక్‌రాంగూడలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. నిత్యం మురుగు సమస్య, చెత్తాచెదారంతో ఇబ్బందులుపడుతున్నామని వాపోతున్నారు. ఒకప్పుడు పచ్చనిపొలాలు.. చెరువులు, కుంటలు, కొండలు, గుట్టలు, రకరకాల చెట్లతో ఆహ్లాదపూరిత వాతావరణం నానక్‌రాంగూడ సొంతం. మూడు దశాబ్దాల నుంచి నానక్‌రాంగూడలో ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఇతర సంస్థలు ఏర్పాటయ్యాయి. అందమైన రోడ్లు, అద్దాల బహుళ అంతస్థుల మేడలతో ఐటీ, ఇతర, విద్యా, శిక్షణ సంస్థలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో రాకపోకలు గణనీయంగా పెరిగిపోయాయి. ఈ క్రమంలో స్థానిక సమస్యలు పరిష్కరించాలని ఈ ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు.

బడా సంస్థల చేరువలో అపరిశుభ్రత

- నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన అమెజాన్, వేవ్‌రాక్ భవనంకు చేరువలోనే చెత్తాచెదారం పేరుకుపోయింది.
- వర్షాకాలంలో కావడంతో చెత్త భారీగా పేరుకుపోయినా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- జీహెచ్‌ఎంసీ అధికారులు, టీఎస్‌ఐఐసీ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

అంగన్‌వాడీ కేంద్రం వద్ద..

- నానక్‌రాంగూడలో ఒక అంగన్‌వాడీకేంద్రాన్ని కమ్యూనిటీహాల్ (మహిళాభవన్)లో నిర్వహిస్తున్నారు.
- అంగన్‌వాడీ కేంద్రం చెంతనే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూరా చెత్త పేరుకపోవడం పట్ల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- వర్షాకాలం వ్యాధులు వ్యాపించే తరుణంలో చిన్నారులు ఉండే ఈ కేంద్రం వద్ద అపరిశుభ్రత నెలకొంది
- అంగన్‌వాడీ కేంద్రం పరిసరాల్లో అక్రమ పార్కింగ్‌లను తొలగించేలా చూడాలి.
- ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి రోజువారీగా ఈ ప్రాంతంలో చెత్తాచెదారం తొలగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నానక్‌రాంగూడవాసుల డిమాండ్లు..

- నానక్‌రాంగూడలో మౌలిక వసతులను కల్పనకు జీహెచ్‌ఎంసీ, టీఎస్‌ఐఐసీ సంస్థ సమిష్టిగా చర్యలు తీసుకోవాలి.
- కమ్యూనిటీహాల్ (మహిళాభవన్) చుట్టూరా ప్రహరీగోడ నిర్మించాలి.
- ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలను పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలి.
- అంతర్గత రోడ్లన్నింటినీ సీసీరోడ్లుగా, ప్రధాన రోడ్డును బీటీరోడ్డుగా మార్చాలి. శ్మశానవాటికలను అభివృద్ధి చేయాలి
- విద్యుత్ సమస్యలను కూడా శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలి

తెల్లాపూర్‌కు బస్సులు నడపాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌కు బస్సులు నడపాలని ప్రజలు కోరుతున్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో 50కిపైగా కాలనీలున్నాయి. ఈ ప్రాంతంలో ఇంకా అనేక భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. అయితే ప్రజా రవాణా వ్యవస్థ సరిగా లేక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు .గతంలో రామచంద్రాపురంలోని లింగంపల్లి నుంచి తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్ మీదగా కొల్లూర్ వరకు ఆర్టీసీ బస్సులు నడిచేవి. ఉదయం, సాయంత్రం సమయంలో రాకపోకలు జరిగేవి. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో కాలనీలు ఏర్పడడంతో వేలాది మంది ప్రజలు ఇక్కడ నివాసం ఉంటున్నారు. కానీ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థ అభివృద్ధి చేయడంలో పాలకులు విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల తెల్లాపూర్ నైబర్‌హూడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ ఆధ్వర్యంలో రవాణాశాఖ మంత్రి ప్రభాకర్‌కు వినతిపత్రం అందించగా తెల్లాపూర్ మీదగా కొల్లూర్ వరకు ఆర్టీసీ బస్సులు ప్రారంభమయ్యాయి. కానీ అది మూన్నాళ్ల ముచ్చటగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక తెల్లాపూర్ పరిధిలో రైల్వే స్టేషన్ ఉన్నా స్థానికులు ఎంఎంటీఎస్ ఎక్కలేని పరిస్థితి నెలకొందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని బస్సులు నడపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

చెరువులపై దృష్టి సారించాలి



వెస్ట్ జోనల్‌లో చెరువును పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి

గచ్చిబౌలి: చెరువుల శుభ్రతపై దృష్టి సారించాలని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ పి.ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం జోనల్ పరిధిలోని చెరువులను, ప్రధాన కూడళ్లను, పారిశుద్ధ్యంను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తక్షణమే తొలగించాలని అధికారులను ఆదేశించారు. అంతే కాకుండా చెరువులలో చెత్త, వ్యర్థాలు డంప్ చేయకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే వ్యర్థాలు డంప్ చేసి ఉంటే వెంటనే తొలగించాలన్నారు. పారిశుద్ధ్య పనులను మరింత పకడ్బందీగా నిర్వహించాలని రోడ్లపై పేరుకుపోయిన ఇసుక, మట్టిని తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గోపన్‌పల్లి ఫ్లైఓవర్‌ను పరిశీలించిన ఆయన గ్రీనరీ పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్ కమిషనర్ రజినీకాంత్ రెడ్డి, ఏఎంఓహెచ్ డాక్టర్ నగేష్, యూబీడీ మేనేజర్ విక్రం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంప్రదాయ వంటకాలు ప్రదర్శన

పంజగుట్ట: తెలంగాణ సంప్రదాయం ఉట్టిపడేలా బోనాల వేడుకలు గురువారం సోమాజిగూడలోని పార్క్ హోటల్‌లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో అమ్మవారికి సమర్పించే బోనాలు, తెలంగాణ సంప్రదాయ వంటలు ప్రదర్శనకు ఉంచారు. నాటుకోడి, చిట్టిగారెలు, బగారన్నం మటన్ కర్రీ, సకినాలు, బెల్లం అన్నం, పాయసం, పచ్చి పులుసు ఇలా తదితర తెలంగాణ వెరైటీలు ప్రదర్శనకు ఉంచారు. ఈ నెల 21వ తేదీన సికింద్రాబాద్ బోనాలు, అలాగే 28న జరిగే హైదరాబాద్ బోనాల పండగ సందర్భంగా తెలంగాణ వంటకాలు మొత్తం 25 రకాలు మధ్యాహ్నం 12:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంచనున్నట్లు చెఫ్ సత్య పండరి తెలిపారు. ఈ కార్యక్రమంలో చెఫ్‌లు మహేందర్, శ్రీనివాస్, ప్రతినిధి శ్లోక పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: ఫీడర్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు కొమరం భీమ్ పరిధిలోని టీఎన్‌జీఓస్ ఫేజ్-1, ఫేజ్-2 పరిధిలో, మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు జర్నలిస్ట్ కాలనీ ఫీడర్ పరిధిలోని జర్నలిస్ట్ కాలనీ, గౌలిదొడ్డి, పద్మశ్రీ గార్డెన్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీజేపీ నాయకుల పర్యటన



నెహ్రూనగర్‌లో పర్యటిస్తున్న రవికుమార్ యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ నెహ్రూనగర్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ ఎం.రవికుమార్ యాదవ్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ నెహ్రూనగర్‌లో మౌలిక వసతుల కల్పనకు ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. బస్తీలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారిందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరించేలా చూస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కంటెస్టెడ్ కార్పొరేటర్ కె.ఎల్లేష్, మానప్ప, శంకర్, ప్రవీణ్, రవి, కిరణ్, రాజు, సతీష్, నరేష్, సంతోష్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

పటాన్‌చెరు: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం, ఆరోగ్యం తదితర అంశాల్లో కీలక భూమిక పోషిస్తున్న ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

12 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం..మంగళ, బుధవారాల్లో నిర్వహించిన డ్రైవ్‌లో 12 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 12 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

విద్యుత్ సమస్య..నిమిషాల్లో పరిష్కారం

- దాదాపుగా ఫీడర్ల సర్వే పూర్తి
- యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న అధికారులు



సర్వే నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

బంజారాహిల్స్: ఎక్కడైనా విద్యుత్ అంతరాయాలు తలెత్తితే నిమిషాల్లో సమస్యను గుర్తించి పరిష్కరించేలా టీజీఎయిమ్స్ యాప్‌ను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో జూన్ 24వ తేదీ నుంచి 11కేవీ ఫీడర్ల సర్వేను చేపట్టింది. సర్వేలో భాగంగా అధికారులు, సిబ్బంది సంబంధిత ఫీడర్ల పరిధిలో వివరాలు, ఫొటోలను నమోదు చేస్తున్నారు. ఇప్పటికే 99 శాతం ఫీడర్ల పరిధిలో సర్వే పూర్తయ్యింది. ఈ సర్వే పూర్తయితే కరెంటు పోల్స్‌ను, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తలెత్తే సాంకేతిక లోపాలను త్వరితగతిన గుర్తించేందుకు వీలవుతుంది. సంబంధిత యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. ఖైరతాబాద్, సోమాజిగూడ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, వెంకటేశ్వరకాలనీ, ఫిలింనగర్, ఎల్లారెడ్డిగూడ, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట, శ్రీనగర్‌కాలనీ, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, రహమత్‌నగర్, కృష్ణానగర్, వెంకటగిరి తదితర ప్రాంతాల్లో 11కేవీ ఫీడర్ల సమగ్ర సర్వే దాదాపుగా పూర్తి కావచ్చింది. స్తంభాలు, డీటీఆర్‌ఏలు, ఆర్‌ఎంయూల వరకు ప్రతిదీ లెక్కించి జీపీఎస్‌తో అనుసంధానం చేస్తున్నారు. ఈ సర్వేలో ఎస్ఈ నుంచి ఆర్టిజన్ వరకు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్నారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో 11కేవీ ఓవర్ హెడ్‌లైన్స్, ఎల్‌టీ లైన్స్ విస్తరించి ఉన్నాయి. అలాగే డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వీటి పరిధిలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, లైన్లు, ఇన్సులేటర్లు, ఏబీ స్విచ్‌లు, కండక్టర్లు, డీటీఆర్‌ల వివరాలను పక్కాగా సేకరించి టీజీఎస్‌పీడీసీఎల్ జీఐఎస్ అసెట్ ఇన్స్‌పెక్షన్ మెయింటెనెన్స్ సిస్టంలో నమోదు చేస్తున్నారు. ముఖ్యంగా సబ్‌స్టేషన్, పోల్ లొకేషన్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ స్ట్రక్చర్, రింగ్ మెయిన్ యూనిట్, ఆటో రీక్లోజ్, లైన్ ఏబీ స్విచ్‌ల జీఐఎస్ మ్యాపింగ్ చేయడంతో పాటు స్తంభాల పరిస్థితి (సిమెంట్, ఐరన్, రైల్వేట్రాక్ పోల్) టీటీఆర్ స్ట్రక్చర్ ఎలా ఉంది, విద్యుత్ తీగల పరిస్థితి, పోల్స్ మధ్య గ్యాప్ వంటి విషయాలను ఈ యాప్‌లో పొందుపరుస్తున్నారు. తద్వారా భవిష్యత్తులో లైన్ల పునరుద్దరణ పనులతో పాటు మెటీరియల్ సమకూర్చడం, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించడం, త్వరితగతిన ఘటనా స్థలాన్ని గుర్తించడం లక్ష్యంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న ఫీడర్లు..

సబ్‌స్టేషన్ పేరు	11కేవీ ఫీడర్లు	సర్వేపూర్తయినవి
అమీర్‌పేట	15	15
ఎస్‌కేనగర్	12	12
యూసుఫ్‌గూడ	16	15
బంజారాహిల్స్	43	41
ఫిలింనగర్	32	32
జూబ్లీహిల్స్	33	33
మాదాపూర్	39	33
మోతీనగర్	9	9
గ్రీన్‌ల్యాండ్స్	24	24
ఎస్‌ఆర్‌నగర్	22	22
బేగంపేట	30	30
బోరబండ	9	9
సనత్‌నగర్	17	17
ఎర్రగడ్డ	10	10

డంప్‌యార్డు అభివృద్ధి పనులు ప్రారంభం

మణికొండ: డంప్ యార్డ్‌ను అభివృద్ధి చేస్తామని నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్ రెడ్డి అన్నారు. రూ. 70 లక్షల నిధులతో వట్టినాగులపల్లి శివారులో ఉన్న చెత్త డంపింగ్ యార్డు బ్యూటిఫికేషన్ పనులను గురువారం కౌన్సిలర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డంపింగ్ యార్డు నుంచి దుర్గంధం వస్తుందని, చెత్తతో కంపోస్టు ఎరువుల తయారీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలను అందంగా తీర్చిదిద్దుతామన్నారు. కౌన్సిలర్‌లు బి.యాదమ్మ, జి.శివారెడ్డి, జి.అమరేందర్‌రెడ్డి, డీఈ నరసింహరాజు, శానిటేషన్ ఇంచార్జ్ లచ్చిరాం,సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ

మణికొండ: కోకాపేట 5వ వార్డులో గురువారం వైస్ చైర్మన్ జి.విజయ్‌బాబు, కౌన్సిలర్ జి.శివారెడ్డిలు ఇంటింటికి గులాబీ, మామిడి, దానిమ్మ, ఉసిరి, నిమ్మ తదితర మొక్కలను పంపిణీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వీలైనన్ని ఎక్కువ మొక్కలు పెంచాలని నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. నర్సరీలలో అన్ని రకాల మొక్కలను పెంచుతున్నామని, ప్రజలకు వాటిని ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌వాసులకు మొక్కలు అవసరం అయితే తమను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వార్డు అధికారి సంప్రీత్, శానిటేషన్ సూపర్‌వైజర్ మహిపాల్ ,స్థానికులు పాల్గొన్నారు.

యోగా.. ఆరోగ్యానికి మేలు



గచ్చిబౌలి: యోగా ఆరోగ్యానికి మేలు చేస్తుందని ప్రణవ సంకల్ప యోగా సమితి వ్యవస్థాపకులు పతంజలి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం కొండాపూర్‌లోని న్యూ బ్లూమ్ హైస్కూల్‌లో విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవన విధానంలో ఆహారం, నీరు, శ్వాస, విసర్జన, విశ్రాంతి ధర్మాలు శరీరంలో రోగ నిరోధక శక్తిని ఎలా పెంపొందిస్తాయో తెలియజేశారు. ఆహార నియమాలు పాటిస్తూ యోగాసనాలు చేస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో న్యూబ్లూమ్ హైస్కూల్ కరస్పాండెంట్ యు.కిరణ్ , ప్రిన్సిపల్ లాలీ జెమ్స్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

ఎస్పీ రూపేష్ .. అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ రూపేష్ గురువారం సాయంత్రం పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను, పరిసరాలను పరిశీలించారు.5 ఎస్ అమలు విధానాన్ని పరిశీలించారు.అమీన్‌పూర్ సీఐ నాగరాజుతో పాటు సిబ్బందితో మాట్లాడారు. తరచూ జరుగుతున్న సైబర్ నేరాల గురించి ఆయా గ్రామాలలో, కాలనీలలో, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి సస్పెక్ట్, హిస్టరీ షీటర్‌ల కదలికలను చెక్ చేయాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎన్ బీడబ్ల్యూలు త్వరగా ఎగ్జిక్యూట్ అయ్యే విధంగా ప్రత్యేక టీం ఏర్పాటు చేయాలన్నారు. కాగా సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్న వారిలో అధికంగా విద్యావంతులే ఉంటున్నారని, అత్యాశకు పోయి అనవసర లింక్‌లు ఓపెన్ చేయకూడదని, ఆన్‌లైన్‌లో అపరిచితులతో పరిచయాలకు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా సూచించారు.సైబర్ నేరాలకు గురైనట్లైతే 1930 లేదా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ముఖ్యంగా జిల్లాలో మాదక ద్రవ్యాల ఆనవాళ్లు ఉన్న, గంజాయి పండించినా నంబర్ 8712656777 కు కాల్ చేసి గాని, వాట్సాప్ ద్వారా గాని సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. సీఐ ప్రవీణ్ రెడ్డితో పాటు సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన చెప్పారు.